# ‘ఈటల’కు మరో బిగ్ షాక్

- పోతిరెడ్డిపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు, బీజేపీ నాయకుడు దూలం శ్రీనివాస్, తదితరులు బీఆర్ఎస్‌లోకి
- గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన ‘పాడి’



పార్టీలో చేరిన నాయకులతో మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, అక్టోబర్ 18: ఎన్నికలు సమీపిస్తున్న వేళ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌కు మరో బిగ్ షాక్ తగిలింది. బీఆర్ఎస్ హుజూరాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో ఈటల ముఖ్య అనుచరుడు వీణవంక మండలంలోని పోతిరెడ్డిపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు, బీజేపీ సీనియర్ నాయకుడు దూలం శ్రీనివాస్‌తో పాటు పలువురు నాయకులు బుధవారం వీణవంకలోని మండలి విప్ నివాసంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన బీజేపీ నాయకులకు గులాబీ కండువాకప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం మండలి విప్ మాట్లాడుతూ, బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక నాయకులు ఆ పార్టీని వీడుతున్నారని, బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. రానున్న రోజుల్లో ప్రతిపక్షాలకు నాయకులు, కార్యకర్తలు లేకుండా పోతారని పేర్కొన్నారు. సంక్షేమం, అభివృద్ధిని ఒక ఉద్యమంలా కొనసాగిస్తున్న సీఎం కేసీఆర్ వెంటే ప్రజలంతా ఉన్నారని, మూడోసారి సీఎం కేసీఆరేనని స్పష్టం చేశారు. బీజేపీలో పని చేసే నాయకులకు గుర్తింపు లేదని, అసలు ఈటల పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు అన్నారు. ప్రజల కోసం పనిచేసే బీఆర్ఎస్‌కే తమ మద్దతని, హుజూరాబాద్‌లో పాడి కౌశిక్‌రెడ్డిని గెలిపించుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గంగాడి తిరుపతిరెడ్డి, ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, గౌడ సంఘం నాయకులు తిరుపతి, సతీశ్, మధు, మహేశ్, నారాయణ, రాజమల్లు, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.



మారేడుపల్లి గ్రామంలో మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

# స్కాంల కాంగ్రెస్‌ను బొందపెట్టండి

- వాళ్లకు అధికార దాహం తప్ప అభివృద్ధిపై ఎజెండానే లేదు
- నమ్మితే మోస పోతం..
- మరోసారి ఆశీర్వదించండి.. ఆత్మబంధువుగా ఉంటా
- మంత్రి కొప్పుల ఈశ్వర్
- పలు గ్రామాల్లో ప్రజా ఆశీర్వాద యాత్ర

వెల్గటూర్, అక్టోబర్ 18: ‘కాంగ్రెస్ దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించి చేసిందేమీ లేదు. ప్రజలను నిండా ముంచింది. అభివృద్ధిని విస్మరించి అవినీతికి పాల్పడింది. అలాంటి స్కాంల పార్టీని ప్రజలు బొందపెట్టాలని’ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. ఆ పార్టీ నాయకులకు అధికార దాహం తప్ప అభివృద్ధిపై ఎజెండా ఉందా..? నోరు తెరిస్తే చాలు అన్నీ అబద్ధాలే. ఆరు గ్యారెంటీలంటూ కొత్త ఎత్తుగడలతో వస్తున్నరు..? ఇంకా నమ్ముదామా..?’ అంటూ ప్రశ్నించారు. బుధవారం ఎండపల్లి మండలం మారేడుపల్లి, ఉండేడ, ముంజంపల్లిలో ప్రజా ఆశీర్వాదయాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో మంత్రికి మహిళలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అమాత్యుడు ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. అంతకు ముందు కొత్తపేటలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీలు రెండూ రెండేనని, అధికారం కోసం ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నాయని దుయ్యబట్టారు. వాళ్లది అధికార యావ అయితే.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తాము అభివృద్ధి కోసం కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. తెచ్చుకున్న తెలంగాణను తొమ్మిదేండ్లలోనే అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే నంబర్‌వన్‌గా నిలుపుకొన్నామని ఉద్ఘాటించారు. రాష్ట్రాన్ని 50ఏండ్లకు పైగా పాలించిన కాంగ్రెస్ పార్టీ, మళ్లీ ఒక్క చాన్స్ ఇవ్వాలని వస్తున్నదని, ఏనాడైనా వాళ్లు దళితుల అభ్యున్నతికి ఆలోచన చేశారా..? అని ప్రశ్నించారు. దళితులను కేవలం ఓటు బ్యాంక్‌గానే చూశారే తప్ప వారిని బాగు చేయాలనే కనీస సోయి కూడా లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దళితుల అభివృద్ధి కోసం రూ.21 వేల కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. దళిత బంధు పథకంతో కుటుంబాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు గ్రామాల్లోకి వస్తే ఎక్కడికక్కడ నిలదీయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వారి పాలనలో ఇలాంటి పథకాలు ఎందుకు తేలేదో ప్రశ్నించాలని సూచించారు. ‘ఓ మంత్రిగా కాకుండా ఓ సాధారణ వ్యక్తిగా ఎల్లవేళ్లలా అందుబాటులో ఉంటూ అండగా నిలుస్తున్న నన్ను మరొకసారి ఆశీర్వదించండి. మిమ్ముల కడుపులో పెట్టుకుని చూసుకుంటానని’ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాలోల సర్పంచులు గందం లక్ష్మీనారాయణ, పల్లె అశోక్, సుదగోని లావణ్య–శ్రీనివాస్, పాలకుర్తి ఎంపీపీ వ్యాళ్ల అనసూర్య–రాంరెడ్డి, ప్రముఖ ఎన్ఆర్ఐ వ్యాళ్ల హరీశ్‌రెడ్డి, వెల్గటూర్ వైస్ ఎంపీపీ కవిత–దేవేందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్, మాజీ జడ్పీటీసీ వ్యాళ్ల అనిత, ప్యాక్స్ చైర్మన్ గూడ రాంరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు సింహాచలం జగన్, మండల యువత అధ్యక్షులు బిడారి తిరుపతి, రామగిరి మల్లేశ్, నాయకులు మూగల సత్యం, జీరెడ్డి మహేందర్‌రెడ్డి, రామడుగు రాజేశం, కోడి గంగయ్య, మ్యాన రాయమల్లు, సంజీవ్ యాదవ్, అరికిల్ల మహేందర్, చింతల తిరుపతి, చుంచు మల్లేశ్, చొంపదండి సురేందర్, మంగ, అంజీ, రాజేశం, రామయ్య, మహిళలు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న మంత్రి సతీమణి రజిత తదితరులు



అమ్మవారికి పల్లకీ సేవలో పాల్గొన్న మేయర్

# నగరంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాల్లో పాల్గొన్న జిల్లా జడ్జి ప్రతిమ, మహిళా న్యాయమూర్తులు, న్యాయవాదులు

కమాన్‌చౌరస్తా, అక్టోబర్ 18: జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించగా, మంత్రి గంగుల సతీమణి రజిత పాల్గొని మహిళలతో కలిసి ఆడిపాడారు. మన సంప్రదాయ పండుగను అందరం కలిసికట్టుగా జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ కాలనీ వాసులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించగా, కలెక్టర్ బీ గోపి దంపతులు హాజరయ్యారు. పలు డివిజన్లలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అమ్మవారి పల్లకీ సేవల్లో మేయర్ వై సునీల్‌రావు పాల్గొన్నారు.

**బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..**

కోర్టు చౌరస్తా, అక్టోబర్ 18: జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో జిల్లా జడ్జి ప్రతిమ, మహిళా న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ ఎన్నికల కో ఆర్డినేటర్‌గా ఇనుగాలపెద్దిరెడ్డి



పెద్దిరెడ్డి

కార్పొరేషన్/ హుజూరాబాద్ టౌన్, అక్టోబర్ 18: హుజూరాబాద్, హుస్నాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాల బీఆర్ఎస్ ఎన్నికల కో ఆర్డినేటర్‌గా మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత ఇనుగాల పెద్దిరెడ్డిని నియమిస్తూ పార్టీ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు, మంత్రి కేటీఆర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, తన నియామకానికి సహకరించిన రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మంత్రి గంగుల కమలాకర్, రెండు నియోజకవర్గాల సీనియర్ నేతలకు పెద్దిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## ఖాదీ వస్త్రాల కొనుగోళ్లపై ప్రత్యేక తగ్గింపు

హౌసింగ్‌బోర్డుకాలనీ, అక్టోబర్ 18: దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కమాన్ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో గల మెట్‌పల్లి ఖాదీ భవన్‌లో ఖాదీ వస్త్రాల కొనుగోలుపై 40శాతం ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు సంస్థ చైర్మన్ కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, ఖాదీ భవన్ మేనేజర్ భిక్షపతి బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నవంబర్ 15వ తేదీ వరకు ఈ తగ్గింపు ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఖాదీ వస్త్రాలు కొనుగోలు చేసి నేత కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు.

## కూష్మాండ అలంకారంలో అమ్మవారు

వేములవాడ టౌన్, అక్టోబర్ 18: దేవీశరన్నవరాత్రుల్లో భాగంగా వేములవాడ రాజన్న ఆలయంలో అమ్మవారు ఐదోరోజు బుధవారం కూష్మాండ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు పూజలు చేశారు. రాత్రివేళలో అమ్మవారు పట్టణ పురవీధుల్లో హంస వాహనంపై విహరించగా, మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి పూజలు చేశారు.

## బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావాలని..

- ప్రగతి భవన్‌కు యువకుడి పాదయాత్ర

వీర్నపల్లి, అక్టోబర్ 18: బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి రావాలని ఆకాంక్షిస్తూ జవహర్‌నాయక్‌తండాకు చెందిన నవీన్ అనే యువకుడు గ్రామం నుంచి ప్రగతిభవన్ వరకు బుధవారం పాదయాత్ర చేపట్టాడు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చేస్తున్న అభివృద్ధికి తాను ఆకర్షితుడినై.. వారికి వీరాభిమానిగా మారిపోయానని తెలిపారు. కేసీఆర్ పాలనలోనే రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. బీఆర్ఎస్ మూడోసారి ప్రభుత్వం ఏర్పాటు చేయాలనే సంకల్పంతో పాదయాత్ర చేస్తున్నట్లు వెల్లడించాడు. అంతకుముందు పాదయాత్రను సర్పంచులు కమటం మల్లేశం, భూక్యా శ్రీనివాస్ ప్రారంభించారు. పాదయాత్ర వీర్నపల్లి చేరు కోగా, ఉప సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు బోయిని రవి శాలువా కప్పి సన్మానించారు. దారిఖర్చుల కోసం ₹వెయ్యి అందించారు.



జవహర్‌నాయక్‌తండాలో పాదయాత్రను ప్రారంభిస్తున్న నవీన్

# బతుకమ్మ వేడుకలపై విదేశీయుల అధ్యయనం



శంకరపట్నం మండల కేంద్రానికి చేరిన బైక్ యాత్ర బృందం

శంకరపట్నం, అక్టోబర్ 18 : తెలంగాణలో బతుకమ్మ వేడుకలను ప్రత్యక్షంగా తిలకించడానికి వచ్చిన అంతర్జాతీయ అధ్యయన బృందం బుధవారం కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండల కేంద్రానికి చేరుకుంది. అమెరికా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, బ్యాంకాక్, సింగపూర్, తదితర దేశాలకు చెందిన పలువురు తెలంగాణలో ప్రసిద్ధి చెందిన బతుకమ్మ వేడుకలను అధ్యయనం చేయడానికి బైక్ యాత్ర చేపట్టారు. సోషల్ మీడియాలో తెలంగాణకు చెందిన పలు పోస్టులను చూసిన తాము ఇక్కడి కల్చర్‌కు ఆకర్శితులమై బతుకమ్మ వేడుకలను ప్రత్యక్షంగా తిలకించి, అధ్యయనం చేయడానికి ప్రత్యేకంగా ఇండియాకు వచ్చినట్లు బృంద సభ్యురాలు, ఫ్రాన్స్ దేశస్తురాలైన హరిస్సల్ తెలిపారు. హైదరాబాద్ నుంచి మహబూబ్‌నగర్, నిర్మల్, వికారాబాద్, జన్నారం, నుంచి కరీంనగర్ మీదుగా బుధవారం వరంగల్ వెళ్తున్నట్లు చెప్పారు. అక్కడ రామప్ప ఆలయాన్ని సందర్శించనున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి బతుకమ్మ వేడుకలను తిలకించనున్నట్లు వెల్లడించారు. ఈ టూర్‌ను తాము ఎంతగానో ఆస్వాదిస్తున్నట్లు తెలిపారు.